
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 17.0
ANDHRAJYOTHY 5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 30 డిసెంబరు 2024



రాష్ట్ర స్థాయిలో యాదిరెడ్డిపల్లి విద్యార్థి ప్రతిభ

తాడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని యాదిరెడ్డిపల్లికి చెందిన బీ చంద్రశేఖర్ ఉషూ పోటీలలో తృతీయ స్థానంలో నిలిచాడు. చంద్రశేఖర్ తాడూరు జడ్పీ హెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి సీతారాం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చే క్రమంలో సీఎం కప్‌ను పోటీలు నిర్వహిస్తుందన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న చంద్రశేఖర్ తృతీయస్థానంలో నిలవడం సంతోషంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



వరి నాటేస్తున్న కూలీలు

సాగు.. బాగు

- ఉమ్మడి జిల్లాలో అధిక వర్షాలు
- నిండుకుండల్లా జలాశయాలు
- పెరిగిన వరి సాగు విస్తీర్ణం
- తెగుళ్లతో పత్తికి నష్టం
- ఆందోళన కలిగిస్తున్న పప్పు దినుసుల సాగు
- ఆగుతూ.. సాగుతున్న ప్రాజెక్టుల పనులు

ఆంధ్రజ్యోతి రౌండప్ 2024

నాగర్‌కర్నూల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరుణ దేవుడి కరుణతో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో సాగు సుభిక్షంగా సాగింది. అధిక వర్షాల కారణంగా పత్తి, వరి సన్నరకాలకు నష్టం వాటిల్లినప్పటికీ భూగర్భ జల మట్టం బాగా పెరిగింది. అయితే ప్రాజెక్టుల కింద వరి సాగు విస్తీర్ణం పెరిగినా.. సంప్రదాయంగా వచ్చే పప్పుదినుసుల పంటలు నారాయణపేట జిల్లాలో తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. దీని కారణంగా మున్ముందు పప్పుధాన్యాల ధరలు మరింత పెరుగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో జలాశయాలు నిండుకుండలను తలపించాయి. జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల కింద సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వ్యవస్థ లేకపోవడం పట్ల అన్నదాతల్లో అసహనం వ్యక్తమవుతుంది.

పెరిగిన వరి సాగు

జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సౌకర్యం

(మిగతా 6లో..)



ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు

సెమీస్‌కు ఎనిమిది జట్లు

- పురుషుల విభాగంలో నారాయణపేట, వనపర్తి, హైదరాబాద్, నల్గొండ.. మహిళల విభాగంలో గద్వాల, రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్ జట్లు
- నేడు సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఫైనల్ మ్యాచ్‌లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు తుది దశకు చేరాయి. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో పురుషుల విభాగంలో నల్గొండ జట్టు హన్మకొండపై 45-27 తేడాతో గెలుపొందింది. రంగారెడ్డి సిద్దిపేటపై 43-20, నారాయణపేట కొత్తగూడెంపై 47-34, వనపర్తి గద్వాలపై 34-23 తేడాతో గెలిచి సెమీస్‌కు చేరాయి. మహిళా విభాగంలో గద్వాల జట్టు మేడ్చల్‌పై 39-20 తేడాతో, రంగారెడ్డి నారాయణపేటపై 75-16, హైదరాబాద్

(మిగతా 6లో..)



తలపడుతున్న హైదరాబాద్, నారాయణపేట జట్లు



నాయినోనిపల్లి మైసమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

నాయినోనిపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచే కాకుండా తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. జాతర మైదానం భక్తులతో సందడిగా మారింది. భక్తులు ఇబ్బంది కలుగకుండా ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

కందిపోతున్న రైతు

- తుఫాన్, మంచు వల్ల తగ్గిన దిగుబడి
- వారం వ్యవధిలో క్వింటాలుకు రూ. 3500లు తగ్గిన ధర
- ప్రభుత్వ కొనుగోలు కోసం ఎదురు చూస్తున్న రైతులు
- జిల్లాలో సాగు విస్తీర్ణం 50 వేల ఎకరాలు



అలంపూరు మండలం, క్యాతూరు గ్రామంలో కందిపంట

కంది సాగు చేసిన రైతులు ఆగమవుతున్నారు. గతేడాది కందులు క్వింటాలుకు సుమారు రూ.13,500 మేర ధర పలకడంతో ఈ ఏడాది జోగుళాంబ గద్వాల జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల్లో సాగు చేశారు. పైరు పూత, పిందె వరకు బాగానే ఉన్నది. ఏపుగా పెరిగిన పైరును చూసి ఈ ఏడాది దిగుబడి బాగా వస్తుందని రైతులు ఆశించారు. ఎకరాకు సుమారు ఎనిమిది నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ ఇటీవల తుఫాన్ ప్రభావం, పొగమంచు కారణంగా పూత పిందె రాలిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఏడాది నాలుగు నుంచి అయిదు క్వింటాళ్ల దిగుబడి వస్తే చాలా ఎక్కువేనని రైతులు వాపోతున్నారు. దిగుబడి తగ్గినా మద్దతు ధరనైనా ఉంటదనుకుంటే ధరలు పూర్తిగా పతనమయ్యాయి. దీంతో కందిరైతులు నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

-అలంపూరు చౌరస్తా, ఆంధ్రజ్యోతి

6

వేతన వెతలు

- ఏడు నెలలుగా ఎదురుచూపులు
- భారంగా మారుతున్న కుటుంబ పోషణ
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న వసతి గృహ సిబ్బంది

ఏడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రభుత్వ వసతి గృహాల్లో పని చేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. వంట చేసి విద్యార్థులకు వడ్డించడంతో పాటు పారి శుధ్య కార్మికులు చేసే పనులను సైతం చేస్తున్నామని, సకాలంలో వేతనాలు రాక కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు సకాలంలో వస్తున్నా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం పెండింగ్ పెడుతున్నారని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరి ప్రతీ నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- ఖిల్లాఘణపురం, ఆంధ్రజ్యోతి



ఖిల్లాఘణపురం ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

6

హక్కుల కోసం అంబులెత్తిన ఆదివాసీలు

- ఘనంగా అటవీహక్కు చట్టం ఆవిర్భావ వేడుకలు

6



అంబులతో నిరసన తెలుపుతున్న చెంచులు

ఒక్క రోజులోనే నగదు రికవరీ

జోగుళాంబ గద్వాల జిల్లాలో రూ.లక్ష చోరీ చేసిన మహిళ అరెస్ట్

6

వాలీబాల్‌లో రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్



సీఎం కప్ రాష్ట్రస్థాయి రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ అత్యాపత్య బాలుర జట్టు

త్వరలో వనపర్తికి సీఎం రేవంత్‌రెడ్డి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎంపీ మల్లు రవి

వనపర్తి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన నిమిత్తం త్వరలో వనపర్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, విద్య, వైద్యం, వ్యవసాయంపై ఎంపీ మల్లు రవితో కలిసి ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. అదే విధంగా పార్లమెంట్ పరిధిలో నిర్వహించనున్న ఉద్యోగ మేళా, రుణమేళాకు సంబంధించిన అంశాలపై కూడా చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు రానున్న షెడ్యూల్ తేదీని కూడా ప్రకటిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

'పురాతన విగ్రహాలను సంరక్షించాలి'

ఖిల్లాఘణపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే తరాలకు సంస్కృతీ సాంప్రదాయాలను అందించడానికి ప్రాచీన విగ్రహాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అని పురావస్తు పరిశోధకుడు డాక్టర్ శివనాగిరెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం పట్టణంలో పురాతన దేవాలయాలను, విగ్రహాలను ఆదివారం సందర్శించి విగ్రహాల ప్రత్యేకతను గ్రామస్థులకు వివరించారు. నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కృష్ణంరాజు, వీహెచ్‌పీ సేవాప్ర ముఖ్ బెస్త శ్రీనివాస్, ఆగారం ప్రకాష్, ఆగారం శేఖర్‌రెడ్డి ఉన్నారు.

SANTOOR
సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి ABN
అందమైన ముగ్గులు వేయండి.. ఆనందంగా బహుమతులు అందుకోండి. రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1,50,000/-లకు పైగా బహుమతులు.
ముగ్గుల పోటీ జరుగు తేదీ & స్థలం :
తేది: 4-1-2025 (శనివారం)
సమయం: ఉదయం 9 గంటలు
వేదిక : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం, బస్టాండ్ ఎదురుగా నాగర్‌కర్నూల్
నిబంధనలు - మహిళలు మాత్రమే పాల్గొనాలి ■ చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి ■ ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి ■ ముగ్గు, రంగులు వగైరా పోటీదారులే తెచ్చుకోవాలి ■ ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు.
మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు :
సెల్: 9985410918, 9440454696
మొదటి బహుమతి రూ.6,000/-
రెండో బహుమతి రూ.4,000/-
మూడో బహుమతి రూ.3,000/-
యవ్వనపు చర్మ రహస్యం



-: స్పాన్సర్స్ : -
గీతాంజలి హైస్కూల్,
గీతాంజలి కిడ్స్ అండ్ ప్రైమరీ స్కూల్,
గీతాంజలి ఐఐటీ అండ్ నీట్ ఫౌండేషన్
నాగర్‌కర్నూల్

Fashion Partner
సెల్సియా
ట్రెండీ మహిళల లో దుస్తులు
DIGSEL WOMEN'S
BRA - PANTIES - SLIPS
SCAN & BUY
selsia
TRENDY WOMEN'S

Gardening Partner
ఎటువంటి పంటలకైనా
క్రాఫ్ట్ వారి
పెర్‌ఫెక్ట్
ఆకు కూరలు, కూరగాయలు, పళ్ల పంటలు, మిరప, పొగాకు, పసుపు వంటి వాణిజ్యపంటలు, వరి, రాగి మొదలైన పంటలు, మిద్దెతోటలు, పెరటి తోటలకైనా చీడపీడలబారిన పడకుండా, లేదా చీడపీడలతో ఆకు ముడలతో పంట పాడైనా రామబాణం లాంటిది 'పెర్‌ఫెక్ట్'. ఒక్క లీటరు నీటికి కేవలం 2ఎంఎల్ పెర్‌ఫెక్ట్‌ను కలిపి పిచికారి చేయడం ద్వారా చీడపీడలు, ఆకుముడత, మిరపలో నల్లతామర వంటి రోగాలను నివారించి, ప్రారదోలి మొక్కలు నూతన జవసత్వాలతో ఏపుగా పెరిగి, (7-15 రోజులకొకసారి పిచికారి చేయవలసి ఉంటుంది) కొత్తపూత పిందెలతో అధిక దిగుబడినిస్తుంది.
✔ వృక్ష ఆయుర్వేదం (100%) ఆర్గానిక్ ✔ సేంద్రీయ వ్యవసాయం ✔ రసాయనిక అవశేషాలు లేని పంటల ఉత్పత్తి ✔ 11 వనమూలికల ఔషధ సమ్మేళనం ✔ సమగ్ర సస్య సంరక్షణ
B.Sc. (Agri), B.Sc.(Horti), Agri Business Management, Any Degree చేసినవారికి ఏరియా/ జిల్లాల వారీగా ఉద్యోగావకాశాలు కలవు.
ఆకర్షణీయమైన ఆదాయం. ఆసక్తిగలవారు మెయిల్‌ద్వారాగానీ, ఫోన్‌ద్వారా గానీ సంప్రదించండి.
ఈమెయిల్ ID: globalgreenperfekt@gmail.com, వెబ్‌సైట్: www.perfektindia.in, కస్టమర్ కేర్ నంబర్లు: 94482 74211, 73377 74148



సెమీస్‌కు ఎనిమిది జట్లు

(మొదటి పేజీ తరువాయి)

వనపర్తిపై 32-18, నల్గొండ కరీంగనర్‌పై 54-15 తేడాతో గెలిచి సెమిస్‌కు చేరాయి. పురుషుల విభాగంలో సెమిస్‌లో రంగారెడ్డితో నల్గొండ, నారాయణపేటతో వనపర్తి తలపడనుండగా, మహిలా విభాగంలో నల్గొండతో హైదరాబాద్, గద్వాలతో రంగారెడ్డి తలపడనున్నాయి. అనంతరం ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు.



తలబడుతున్న హైదరాబాద్, నారాయణపేట పురుషుల జట్లు

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ

సీఎం కప్ టోర్నీల్లో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్న కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులు ప్రతిభ చాటి, జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కబడ్డీ సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ జేడీ మధుసూదన్, డీఎంహెచ్‌వో కృష్ణ, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తిరుమలలో తెలంగాణ నాయకుల

సిఫార్సు లేఖలను స్వీకరించాలి

● విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడు

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో తెలంగాణ నాయకుల సిఫార్సు లేఖలను స్వీకరించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడు అన్నారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తిరుమలలో ఉన్న వేంకటేశ్వరస్వామి దర్శనం విషయంలో ఎలాంటి తేడా లేకుండా జరిగేవని, కానీ ప్రస్తుతం తెలంగాణ భక్తులు, రాజకీయ నాయకులపై వివక్ష చూపుతున్నారన్నారు. తెలంగాణ ప్రజా ప్రతినిధులకు టీటీడీ గతంలో కల్పిస్తున్న సౌకర్యాలను పునరుద్ధరించాలని కోరారు. తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలకు గద్వాల ప్రాంతం నుంచి పట్టుచీరను సమర్పించడం ఆనవాయితీగా ఉందన్న విషయం టీటీడీ అధికారులు గమనించాలన్నారు. తెలంగాణ ప్రజలకు ఆంధ్రా ప్రాంతంలో ఉన్న ఏకైక సంబంధం తిరుపతి అని, గతంలో లాగానే ఇప్పుడు కూడా తిరుమలలో తెలంగాణ నాయకుల సిఫార్సు లేఖలను స్వీకరించాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల, నాయకులు కిశోర్, రవి ప్రకాష్ గౌడు, మోనేష్, శేఖర్ నాయుడు, తిరుమలేష్, గంజిపేట రాజు, వీరేష్‌గౌడు, చంద్రన్న గౌడు తదితరులు ఉన్నారు.

సాగు.. బాగు

ఆంధ్రజ్యోతి రౌండప్ 2024

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడిన కారణంగా వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వాణిజ్య పంటలు సాగు చేసే జోగుళాంబ గద్వాల జిల్లాలో కూడా రైతులు వరి పండించడానికి ఇష్టం చూపుతున్నారు. కూలీల కొరత కారణంగా మిగతా వాణిజ్య పంటల వైపు దృష్టి సారించడం లేదు. నారాయణపేట జిల్లాలో సాగు చేసే కంది ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటకలో కూడా ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ పండించే జొన్నలకు కూడా విపరీతమైన డిమాండ్ ఉంది. ఆందోళనకరమైన అంశం ఏంటంటే ఇక్కడ కూడా సంప్రదాయంగా పండించే పంటలను వదులుకుని వరి సాగు వైపు రైతులు దృష్టి సారించడం గమనార్హం. నారాయణపేట జిల్లాలో సాగు భూమి 4,25,203 ఎకరాలు ఉండగా, ఈ సారి 1,71,524 ఎకరాల్లో వరి పండించారు. 70,363 ఎకరాల్లో జొన్నలు, 1,52,994 ఎకరాల్లో పత్తి పండించడం విశేషం. నాగర్‌కర్నూల్ జిల్లాలో 7,12,64 ఎకరాల సాగు భూమి ఉండగా.. ప్రధానంగా 2,19,728 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పంట ఎకరాకు 10

ఉమ్మడి జిల్లా పంటల విస్తీర్ణం, దిగుబడి వివరాలు

జిల్లా	మొత్తం విస్తీర్ణం	సాగు విస్తీర్ణం
మహబూబ్‌నగర్	400000	343000
నాగర్‌కర్నూల్	712062	435253
వనపర్తి	534000	242168
గద్వాల	425949	296270
నారాయణపేట	425203	295751
మొత్తం	2497214	1488219

నుంచి 15 క్వింటాళ్ల దిగబడి రావాల్సి ఉండగా, అధిక వర్షాల కారణంగా దోమపోటుతో 6 నుంచి 8 క్వింటాళ్లకు పడిపోయింది. అధిక వర్షాలతో వరిలో సన్నరకం దిగుబడి కూడా తగ్గింది. కూలీల కొరత కారణంగా పక్క రాష్ట్రాల నుంచి పిలిపించుకోవడం, యాంత్రీకరణ కారణంగా వ్యవసాయంలో నష్టం వచ్చి భూములను మళ్లీ పడావు పెడుతున్న పరిస్థితులు ఉత్పన్నం అవుతున్నాయి.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం(ఫైల్)

ఆగుతూ... సాగుతూ

ఉమ్మడి జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి, జురాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల ప్రాజెక్టులు ఉన్నాయి. వ్యవసాయానికి ఇవే ప్రధాన జీవనాధారం. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రాధాన్యాలు మారిపోతున్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నాలుగు లక్షలా 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో కొత్త ఆయకట్టును స్థిరీకరించాల్సి ఉండగా, ఇప్పటికీ కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ లేకపోవడం కారణంగా చెరువులు, కుంటల్లో నీళ్ల నింపుతూ పాత ఆయకట్టుకే నీ ళ్లందించే ప్రక్రియ కొనసాగు తోంది.

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోత ల పథకం ద్వారా 12 లక్షలా 50 వేల ఎకరాలకు నీరందిస్తామని చెప్పారు. కానీ ఒక్క మోటార్‌ను ఆన్ చేసి, ఇప్పటికీ ఎకరాకు కూడా నీరందించని పరిస్థితి నెలకొంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి పథకాల్లో రెండు సార్లు భూములు కోల్పోయిన నిర్వాసితులు సర్వం కోల్పోయారు.



నిర్మాణంలో ఉన్న కర్వెన రిజర్వాయర్

వేధిస్తున్న కూలీల కొరత

సమృద్ధిగా నీళ్లున్నా.. వ్యవసాయం బాగున్నా.. కూలీల కొరత ఉమ్మడి జిల్లాలో రైతాంగాన్ని కుదిపేస్తోంది. దాంతో వరి నాట్లు, మందుల పిచికారికి ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. అయితే వారు అధిక మొ త్తంలో కూలి డిమాండ్ చేస్తుండడంతో ఆవేదన చెందుతున్నారు. ఉపాధి హామీ కూలీలను వ్యవసాయ పనులకు మళ్లించి ఆదుకుంటే జిల్లాలో సాగు మరింత లాభదాయకంగా ఉంటుందని ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో కురిసిన మొత్తం వర్షపాతం(మి.మీ) వివరాలు

01-06-2024 నుంచి 30-0-2024వరకు

క్ర.సం	జిల్లా	నమోదైన వర్షపాతం	సాధారణ వర్షపాతం	వ్యత్యాసం
1	మహబూబ్‌నగర్	791.8	486.4	83.0
2	నాగర్‌కర్నూల్	796.8	464.5	72.0
3	వనపర్తి	916.6	475.8	93.0
4	గద్వాల	741.6	424.4	76.0
5	నారాయణపేట	978.2	568.7	72.0
ఉమ్మడి జిల్లా సగటు		845.0	483.96	79.2

పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి

జిల్లా	వరి		జొన్న	
	విస్తీర్ణం	దిగుబడి	విస్తీర్ణం	దిగుబడి
మహబూబ్‌నగర్	94000	400000	6000	24000
నాగర్‌కర్నూల్	156399	406637	6959	5759
వనపర్తి	196200	570781	1933	1599
గద్వాల	94386	274586	0	0
నారాయణపేట	171528	499006	7014	5804
మొత్తం	712513	2151010	21906	37162

జిల్లా	మొక్కజొన్న		పత్తి	
	విస్తీర్ణం	దిగుబడి	విస్తీర్ణం	దిగుబడి
మహబూబ్‌నగర్	15000	270000	95000	760000
నాగర్‌కర్నూల్	41576	103940	219728	208742
వనపర్తి	9054	22635	14721	1389
గద్వాల	15266	38165	170114	170114
నారాయణపేట	0	0	152994	145344
మొత్తం	80896	434740	652557	1285589

జిల్లా	వేరుశనగ		కందులు	
	విస్తీర్ణం	దిగుబడి	విస్తీర్ణం	దిగుబడి
మహబూబ్‌నగర్	0	0	12000	108000
నాగర్‌కర్నూల్	0	0	7199	5759
వనపర్తి	7886	11829	6791	5432
గద్వాల	8798	11829	26249	15750
నారాయణపేట	0	0	70363	56288
మొత్తం	16684	25026	122602	191229

జిల్లా	మిరప		ఇతరములు	
	విస్తీర్ణం	దిగుబడి	విస్తీర్ణం	దిగుబడి
మహబూబ్‌నగర్	0	0	0	0
నాగర్‌కర్నూల్	0	0	3392	0
వనపర్తి	0	0	5181	0
గద్వాల	75843	136517	0	0
నారాయణపేట	0	0	1068	0
మొత్తం	75843	136517	9641	0

వాలీబాల్ రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్



సీఎం కప్ రాష్ట్ర స్థాయి రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ వాలీబాల్ బాల,బాలికల జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ బాల, బాలికల జట్లు రన్నర్‌గా నిలిచాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో వరంగల్ జట్టు మహబూబ్‌నగర్‌పై 22-25, 23-25,15-25తో, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు మహబూబ్‌నగర్‌పై 25-21, 25-15, 23-25, 25-17తో గెలిచి విజేతగా నిలిచాయి. అదే విధంగా హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఆత్యాపత్య టోర్నీలో మహబూబ్‌నగర్ బాలుర జట్టు రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ కోచ్, మేనేజర్లు పర్వేజ్, షఫీ, శాంతి, ఆత్యాపత్య కోచ్, మేనేజర్ ముంతాజుద్దీన్, మహ్మద్‌ఉస్మాన్‌లను డీవైఎస్‌వో శ్రీనివాస్ అభినందించారు. జిల్లా జట్లు రన్నర్‌గా నిలువడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే, హన్మకొండలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ బాలుర జట్టు రన్నర్‌గా నిలిచింది.

ఒక్కరోజులోనే చోరీ నగదు రికవరీ

● నిందితురాలు అరెస్ట్

గద్వాల క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చోరీ చేసిన రూ. లక్ష నగదును పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఒక్కరోజులోనే కేసును ఛేదించి రూ. లక్ష నగదును రికవరీ చేసిననట్లు ఆదివారం పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని సుంకులమ్మ మెట్టు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించుకుంటున్న మహిళ నుంచి మరో మహిళ రూ. లక్ష చోరీ చేసిన సంఘటనపై శనివారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకు సంబంధించి బాధితురాలు కుర్వ కిష్టమ్మ ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో తమ పొలానికి చెందిన క్రాఫ్ లోన్‌కు సంబంధించి రూ. లక్ష నగదును తీసుకొని కొద్దిగా అనారోగ్య సమస్య ఉండటంతో సుంకులమ్మ మెట్టు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లింది. చికిత్స నిర్వహించుకుంటున్న సమయంలో తన దగ్గర డబ్బులతో ఉన్న సంచి మాయమైంది. ఈ చోరీపై నిఘా ఉంచిన పట్టణ పోలీసులు సాంకేతిక కారణాలతో చోరీ జరిగిన విషయాలను గమనించారు. చోరీకి పాల్పడింది గద్వాల మండలంలోని సంగాల గ్రామానికి చెందిన పద్మమ్మగా గుర్తించారు. వెంటనే సంగాలకు వెళ్లి నిందితురాలిని అరెస్ట్ చేయడంతో పాటు ఆమె చోరీ చేసిన రూ. లక్షను రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే కేసు నమోదు అయిన ఒక్క రోజులోనే నిందితులను పట్టుకోవడంతో పాటు పూర్తి నగదును రికవరీ చేయడంతో బాధితులు ఎస్‌ఐకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

అలంపూరుచౌరస్తా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్సై సుబ్బారెడ్డి తెలిపారు. కోదండాపురం స్టేషన్‌లో రూట్ పెట్రోలింగ్ ఆఫీసర్‌గా పనిచేసే తిక్కయ్య ఆదివారం డ్రైవర్ నరసింహ, హెల్పర్ కుమార్‌తో కలిసి హైవేపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తెల్లవారుజామున రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (38) మృతి చెందినట్లు గమనించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసి ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చనిపోయిన వ్యక్తికి లైట్ ఆరెంజ్ రంగు టీషర్ట్, బూడిదరంగు ప్యాంటు వేసుకుని ఉన్నాడని, పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ఆసుపత్రికి తరలించామని, ఆచూకీ తెలిసినవారు ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

కందిపోతున్న రైతు



అలంపూరు మండలం, క్యాతూరు గ్రామంలో యంత్రం ద్వారా కందిపంటను కోస్తున్న రైతులు

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గతేడాది కందులు క్వింటాలుకు సుమారు రూ.13,500 మేర పలకడంతో ఈ ఏడాది రైతులు కందిసాగు వైపు మొగ్గుచూపారు. కానీ రైతుల ఆశలు గల్లంతయ్యాయి. ఏపుగా పెరిగిన పైరును చూసి దిగుబడులు బాగా వస్తాయని రైతులు ఆశించారు. కానీ ఇటీవల తుఫాన్ ప్రభావం, పొగమంచు కారణంగా పూత పిందె రాలిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఒక వైపు దిగుబడులు తగ్గగా మరో వైపు ధరలు పతనమయ్యాయి. దీంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మునుపెన్నడు చేయని విధంగా ఈ ఏడాది జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో సాగుచేసినట్లు అధికారులు చెబుతున్నారు.

కొంప ముంచిన పొగమంచు

వాతావరణ పరిస్థితులు కంది రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. కంది పూతదశలో తుఫాను, పొగమంచు కారణంగా కంది పంటలపై తీవ్ర ప్రభావం పడింది. అప్పటి వరకు పూత, కాతతో ఉన్న పంటలు పొగమంచు వల్ల పూత, పిందె రాలిపోయింది. ఇక తుఫాను వల్ల సుడిపురుగు దాడి పెరగడంతో కాయలు కూడా ముడుచుకుపోయి దిగుబడిపై ప్రభావం పడింది. ఎకరాకు సుమారుగా ఎనిమిది నుంచి 12క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. వాతవరణ పరిస్థితుల కారణంగా ఈఏడాది ఎకరాకు కేవలం 4-5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు వాపోతున్నారు.

కానరాని ప్రభుత్వ కొనుగోళ్లు ..

వారం రోజుల క్రితం క్వింటాలు కంది రూ.9వేల నుంచి రూ.10,200వరకు పలికింది. సరిగ్గా వారం రోజుల వ్యవధిలోనే బహిరంగా మార్కెట్లో రూ.7వేలకు పడిపోయింది. ఒకవైపు దిగుబడులు, మరో వైపు ధరలు పతనం కావడంతో కందిరైతుకు తీరని చింతను మిగిల్చాయి. గతేడాది రూ.10వేలకు పైనే నాఫెడ్ ద్వారా కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా అదే పద్ధతిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,550 చొప్పున నాఫెడ్ ద్వారా నారాయణపేట జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే చేతికొచ్చిన పంటను దళారులు అడిగినకాడికి ఇచ్చుకుంటున్నామని రైతులు వాపోతున్నారు.

వారం రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం



ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. జోగుళాంబ గద్వాల జిల్లాలో కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. మరో వారం రోజుల్లో నిర్ణయం తీసుకుని తెలియజేస్తాం. ప్రస్తుతం ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7,550 నిర్ణయించారు.

- జోగుళాంబ గద్వాల జిల్లా నాఫెడ్ మేనేజర్ నాగేశ్వర్

మద్దతు ధర కల్పించాలి

గతేడాది ప్రభుత్వం క్వింటాలు కందులు రూ.10 వేల పైనే కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా రైతుకు మద్దతు ధర కల్పించి న్యాయం చేయాలి.

మొన్నటిదాక రూ.9 వేలు పలికిన కంది ధర వారం రోజుల్లో రూ.6,500 కు పడిపోయింది. వ్యాపారులు సిండికేటుగా మారి మోసం చేస్తు న్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.9వేలు ధర నిర్ణయించి కొనుగోళ్లు జరపాలి.

-శంకర్‌నాయుడు, కంది రైతు, కంచుపాడు

పూర్వ వైభవం దిశగా పాటుపడాలి



పాలెం విద్యా సంస్థల పూర్వపు అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

బిజినేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాలెం సుబ్బయ్య ఆరు దశాబ్దాల క్రితమే విద్యా సంస్థలను స్థాపించి లక్షలాది పేద విద్యార్థులకు ఉచితంగా అక్షర జ్ఞానం కల్గించిన విద్యాలయాలకు పూర్వ వైభవం తీసుకవచ్చేందుకు పూర్వ విద్యార్థులు కృషి చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బుడ్డయ్య, మోహన్‌బాబులు కోరారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగం పల్లిలోని సుందరయ్య భవనంలో ఆదివారం పాలెం విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సంఘం 36వ వార్షిక సమావేశం నిర్వహించి, సుబ్బయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి మాట్లాడారు. ఇప్పటికే పాఠశాలలో విద్యా వలంటీర్లను నియమించి విద్యార్థులకు బోధన సాగించేందుకు పూర్వ విద్యార్థులు సహకారం అందిస్తున్నారని అన్నారు. డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు సాయంతో ఇన్వర్టర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పూర్వపు అధ్యాపకులు రంగాచార్యులు, జగన్నాథ్‌రెడ్డి, హరేంద్రబాబు, డీఎస్పీ దేవేందర్, పాలెం డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పద్మ, కనకరాజులను పాలెం పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. సభ నిర్వాహకులు అనుపటి మల్లికార్జున్, అనుపటి లక్ష్మీకాంత్, వంగ ఆంజనేయులు గౌడ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, బానూరి నాగరాజు, సుదర్శన్ రెడ్డి, ప్రకాశ్ ఉన్నారు.

సోలారు మోటారుకు మరమ్మతులు

- అటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



మమ్మాయిపల్లి సమీపంలోని ఆడవిలోని సోలారు మోటారుకు మరమ్మతులు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

బిజినేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన సోలార్ పంపు మోటార్ పాడైపోవడంతో మరమ్మతులు చేపట్టినట్లు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ చంటి తెలిపారు. మండలంలోని గంగారం ఫారెస్టు వాచర్ సమీపంలోని చెక్‌డ్యాం వద్ద ఉన్న సోలార్ పంప్ మోటారుకు మరమ్మతులు చేపట్టాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి దేవరాజు ఆదేశాల మేరకు ఆదివారం మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

సోలార్ పంప్ ద్వారా నాటిని చెక్‌డ్యాంలో నింపడం ద్వారా ఆటవీ జంతువులు దాహార్తి తీర్చుకుంటాయని అన్నారు. రాబోయే వేసవిలో మూగ జీవాలకు తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా సోలార్ మోటర్ల మరమ్మతులు, నీటికుంటల్లో నీటి లభ్యత, సాసర్ల శుభ్రత వంటివి సిబ్బందితో ఎప్పటికప్పుడు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే అటవీ ప్రాంతంలో చిరుత పులుల సంచారం ఉన్నందున సమీప రైతులు పశువులను పొలాల వద్ద కాకుండా ఇంటి వద్దకు తీసుకెళ్లాలని కోరారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా అటవీ ప్రాంతంలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట గంగారం బీట్ ఆఫీసర్ మోహన్, సోలార్ మోటార్ మెకానిక్ సురేష్ వాచర్ లక్ష్మయ్య, ఎల్లయ్య, చంద్రయ్య ఉన్నారు.

వేతన వెతలు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మెస్ ఛార్జీలను భారీగా పెంచింది. కానీ వారికి వంట చేసి పెడుతున్న హాస్టల్ సిబ్బందికి మాత్రం వేతనాల చెల్లించకపోవడంతో వెతలు పడుతున్నారు. జిల్లాలోని 20 ఎస్సీ వసతి గృహాల్లో వసతి పొందుతున్న విద్యార్థులు 2,550 మంది ఉన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినప్పుడు మాత్రమే అవుట్ సోర్సింగ్ వంట మనుషులకు, కామాటీలకు, వాచ్‌మెన్లకు వేతనాలు చెల్లిస్తున్నారు. దీంతో నెలల తరబడి వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.

వసతి గృహాల్లోని సిబ్బంది వంట చేసి విద్యార్థులకు వడ్డించడంతో పాటు పారిశుధ్య కార్మికులు చేసే పనులను సైతం చేస్తున్నారు. సకాలంలో వేతనాలు రాక కుటుంబ పోషణ కోసం అప్పుల చేస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్కూల్ స్థాయి వసతి గృహాల్లో వంట మనుషులు 16, కామాటీలు (వంట సహాయకులు) 16, వాచ్‌మెన్‌లు 16 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ హాస్టల్లో 51 మంది సిబ్బంది ఉండగా ఔట్ సోర్సింగ్ సిబ్బంది 33, రెగ్యులర్ 18 మంది ఉన్నారు. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు నెలవారీ జీతాలు సకాలంలో వస్తున్నా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం ఏడు నెలలుగా రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రీ మెట్రిక్ స్థాయి హాస్టల్స్ లోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీల ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ.13,411 మాత్రం చెల్లిస్తున్నారు. జిల్లాలోని 20 ఎస్సీ వసతి గృహాల్లో 13 మంది మాత్రమే వార్డెన్లు ఉండగా మరో ఏడు వసతి గృహాల్లో ఇన్‌చార్జీలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2021వ విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ వసతి గృహాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఏజెన్సీ నిర్వాహకులు వేతనాలు చెల్లిస్తున్నారు.



ఎస్సీ వసతి గృహంలో మరుగుదొడ్డిని శుభ్రం చేస్తున్న వంట సహాయకుడు

జీతాలు లేక ఇబ్బంది పడుతున్నాం



ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. హాస్టల్లో వంట పనులు చేయడంతో పాటు వసతి గృహ ఆవరణం పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేస్తున్నాం. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరి ప్రతీ నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- దావూద్, కామాటి, ఎస్సీ వసతి గృహం, ఖిల్లాఘణపురం

నిధులు వస్తే వెంటనే అందజేస్తాం



ప్రభుత్వ బడ్జెట్ విడుదల చేసిన వెంటనే వేతనాలు అందజేస్తున్నాం. గతంలో ఏప్రిల్ నెల వరకు అందజేశాం. ఇప్పుడు కొత్తగా బడ్జెట్ వచ్చిందని అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఆగస్టు వరకు చెల్లింపులు పూర్తి చేశాం. పెండింగ్ వేతనాలు ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపిస్తున్నాం

- మల్లికార్జున్ , డీఎస్ సీడీవో వనపర్తి

హక్కుల కోసం అంబులెత్తిన ఆదివాసీలు

పదర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు తమ హక్కులను కాలరాస్తున్నాయని నల్లమలలోని ఆదివాసీలు వారి జీవనశైలిలో ఆరాధ్య ఆయుధాలైన అంబులను ఎక్కుపెట్టి నిరసన తెలిపారు. 2006 డిసెంబరు 29న అటవీ హక్కుల చట్టం రాష్ట్రపతి ఆమోదం పొందిన సందర్భంగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని పెట్రాల్‌చేను చెంచు పెంటలో చెంచు వేదిక, పీసా హక్కుల కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులు వారి అనాదిగా వస్తున్న ఆచార, సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సమ్మక్క, సారక్క, కొమురం భీం, బిర్సా ముండా, బయ్యన్న, మల్లుదొర, గంటం దొర, శంభు, హనుమంతప్పా, పండు దొరల చరిత్రతో పాటు, పెద్దలు అటవీ హక్కుల కోసం పోరాడిన తీరును భావితరాలకు వారసత్వంగా వివరించారు. చెంచు వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండ్లి అంజయ్య మాట్లాడుతూ రాష్ట్ర అడవుల ఏకీకరణ సమయంలో ముందుగా ఉన్న హక్కులు గుర్తించబడని లక్షలాది మంది అటవీ నివాస గిరిజనులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని రద్దు చేస్తూ అటవీ హక్కు చట్టం-2006 డిసెంబరు 15న లోక్‌సభలో, 18న రాజ్యసభలో పెట్టారని గుర్తుచేశారు. డిసెంబరు 29న రాష్ట్రపతి ఆమోదం పొందటంతో ఆదివాసిలోని తొమ్మిది తెగలలో పునరుద్ధరణ జరిగిందన్నారు. అక్షరాస్యతతో పాటు, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగని మా గూడేలలో, చెంచు పెంటల్లో గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసా వైస్ ప్రెసిడెంట్ మండ్లీ సోమయ్య, పీసా సెక్రటరీ చిగుర్ల హనుమయ్య, అటవీ హక్కుల సెక్రటరీ అంజయ్య, చెంచు వేదిక కన్వీనర్, గూడెం పెద్ద ఎల్లయ్య, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మందా జగన్నాథ్‌ను పరామర్శించిన కేటీఆర్

ఎర్రవల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు మందా జగన్నాథ్ పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను ఆదివారం మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కోమాలో ఉన్న మందాతో మాట్లడేందుకు ప్రయత్నించారు. ఆయన కుమారుడు మందా శ్రీనాథ్‌తో మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దాసోజ్ శ్రవణ్‌తో పాటు ఇటిక్యాల మాజీ ఎంపీపీ మందా వెంకట్‌కుమార్ తదితరులున్నారు.



మాజీ ఎంపీ మందాను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ


తిరుమల ఆలయంలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు ఆదివారం రాత్రి నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందున్న అఖిలాండం వద్ద కొబ్బరికాయలు సమర్పించి బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు వారు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

పోతన చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు

పాలకుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పేలా పాలకుర్తి వాసులతో పాటు రాష్ట్ర ప్రజలు కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు అన్నారు. పోతన జయంతి ఉత్సవాలను ప్రతీ ఏటా బమ్మెరలో నిర్వహించాలన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక తెలంగాణలో ప్రాచీన దేవాలయాలను అద్భుతంగా తీర్చిదిద్దారని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, వల్మిడిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల్లో జస్టిస్ రాజేశ్వరరావు, పద్మావతి దంపతులు పూజలు చేశారు. బమ్మెరలోని పోతన సమాధిని సందర్శించారు. పోతన మోటబావి వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రాజేశ్వరావు మాట్లాడుతూ.. బసవపురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాథుడు కూడా ఇక్కడే జన్మించారని, కవులకు నిలయంగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందిందని అన్నారు.

కులగణనపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- సర్వేపై సర్కారుకు స్పష్టత లేదు: జాజుల

కవాడిగూడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సర్వేపై సీఎం రేవంత్‌రెడ్డికి అధికారులు తప్పుడు లెక్కలు చూపిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దోమలగూడ బీసీ భవన్‌లో మీడియా సమావేశంలో జాజుల మాట్లాడారు. కులగణన సర్వేపై ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే పూర్తి స్థాయిలో సమగ్ర కులగణన నిర్వహించిన తర్వాతే అసెంబ్లీలో బిల్లు పెట్టాలన్నారు. రాష్ట్రంలో అద్దెకు ఉంటున్న వారి ఇళ్లకు ఏ అధికారి ఇప్పటివరకు సర్వేకు వెళ్లలేదని ఆరోపించారు. బిహార్‌లో సొంతిళ్లకు ఒకసారి, అద్దె ఇళ్లకు మరోసారి కులగణన చేసినట్లు ఇక్కడా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటు బస్సులో గంజాయి చాక్లెట్ల పట్టివేత

- విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా తనిఖీ
- నలుగురు మహిళలు సహా ఆరుగురి అరెస్టు

కోదాడ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయదారులు రోజుకో కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నారు. తాజాగా గంజాయిని చాక్లెట్ల రూపంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో ఈ ఘటన జరిగింది. ఎక్సైజ్ సీఐ శంకర్, ఎస్సై గోవర్ధన్ వివరాల మేరకు.. రాష్ట్ర సరిహద్దు కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఓ ట్రావెల్స్ బస్సులో సోదాలు చేశారు. ఒడిశాకు చెందిన అనిల్, బకించంద్రతో పాటు మరో నలుగురు మహిళలు బ్యాగులో గంజాయి చాకెట్లను తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ చాక్లెట్ల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు.

భయపడే రక్తం మాది కాదు
భయపెట్టే రక్తం మాది

- కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే నాపై, కేటీఆర్‌పై కేసులు: ఎమ్మెల్సీ కవిత


నిజామాబాద్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కవిత

సుభాష్‌నగర్ (నిజామాబాద్), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే నాపై, కేటీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీలు కలిసి అక్రమ కేసులు పెడుతున్నాయి. ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తి లేదు. మాది భయపడే రక్తం కాదు.. భయపెట్టే రక్తం' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం నిజామాబాద్ పర్యటనకు వచ్చిన కవిత జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించి అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తప్పు చేయనిది భయపడే ప్రసక్తే లేదని, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పు కణికల్లా బయటకు వస్తారన్నారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని దేనికీ భయపడనని చెప్పారు. ప్రశ్నిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేసులు పెడుతోందని, ఇక రాష్ట్రంలో అక్రమ కేసులపై చెప్పనవసరం లేదన్నారు. హామీల అమలులో రేవంత్ సర్కార్ విఫలమైందని, గ్రామాల్లో హామీలపై కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు.

బీసీలపై కవితది మొసలి కన్నీరు

- అధికారంలో పదేళ్లు ఉన్నా కేసీఆర్ బీసీలకు అన్యాయం చేశారు
- ఈ-ఫార్ములా కేసుతో కేంద్రానికి ఏం సంబంధం?: ఎంపీ రఘునందన్



సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీలపై కల్వకుంట కవిత మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు హితవు పలికారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆయన ఆదివారం సంఘీభావం తెలిపారు. బీసీలకు అన్యాయం జరుగుతుందని, బీసీ కులగణన చేయాలని కవిత డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్ బీసీలకు అన్యాయం చేశారని, బీఆర్ఎస్ నేతలు బీసీల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. కేంద్రం, బీజేపీ భయపెట్టాలని చూస్తున్నట్లు కవిత చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటే గౌరవంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. గతంలోనూ మోదీ, ఈడీ, బోడీలని కవిత అన్నారని గుర్తు చేశారు. తిహాడ్ జైలుకు పోయి వచ్చినా కవిత మారలేదన్నారు. ఈ-ఫార్ములా రేసు కేసుతో కేంద్రానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం కట్టుబడి ఉంటానని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని స్పష్టం చేశారు.

ప్రతి కమతానికి భూధార్!

(మొదటిపేజీ తరువాయి)



కలిగి ఉన్నారు, హక్కులపై ఉన్న షరతులు, శిస్తు వివరాల కాలమ్స్‌ను పొందుపరిచారు. 1971 చట్టం ప్రకారం యజమాని, పట్టాదారు, తనకాదారు, అనుభవదారు, కౌలుదారుపేర్లు, వారికి ఉన్న భూమి వివరాల కాలమ్స్‌ను పొందుపరిచారు. 2020 చట్టంలో పట్టాదారు పేరు, భూమి ఉన్న సర్వే నంబరు, విస్తీర్ణం, ఇతర వివరాలతో కాలమ్స్ ఉండగా.. 2024 భూ భారతిలో యజమాని, అనుభవదారు, తనఖాదారు పేర్లు, వారికి ఉన్న భూమి వివరాలు, ఆ భూమి ఎలా సంక్రమించింది, హక్కులపై ఉన్న షరతులు, భూమి శిస్తు వివరాల కాలమ్స్‌ను ప్రవేశపెట్టారు. 1948లో ఆర్వోఆర్ చట్టం రూపొందించేటప్పుడు వ్యవసాయ భూముల సెన్సెస్ నిర్వహించి ఖాస్రాపహాణీ హక్కుల రికార్డును ప్రకటించారు. 1971లో భూ యజమానుల నుంచి దరఖాస్తులు తీసుకుని, గ్రామ సభల ద్వారా 1బీ రిజిస్టర్ తయారు చేశారు. 2020లో 1971 నాటి 1బీ రిజిస్టర్‌నే ఆర్వోఆర్‌గా స్వల్ప మార్పులతో ప్రకటించారు. కొత్తగా హక్కుల రికార్డు రూపొందించలేదు. 2024 చట్టంలో మాత్రం రిజిస్ట్రేషన్ సందర్భంగా చేపట్టే సర్వే ఆధారంగా కొత్త హక్కుల రికార్డును రూపొందించే అవకాశం కల్పించారు.

తప్పుల సవరణ ఇలా?

1948 చట్టం ప్రకారం రెండేళ్ల గడువులోగా తప్పులు గుర్తిస్తే ప్రభుత్వం నిర్దేశించిన అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు. 1971 చట్టం ప్రకారం ఏడాది గడువు లోపల ప్రభుత్వం నిర్దేశించిన అధికారికి దరఖాస్తు పెట్టుకునే అవకాశం ఇచ్చారు. 2020 చట్టంలో హక్కుల రికార్డు సవరణకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 2024 చట్టంలో ఏడాది లోపల దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. తహసీల్దార్ స్థాయిలో తప్పు జరిగితే ఆర్డీవోకు, ఆర్డీవో స్థాయిలో పొరపాటు జరిగితే కలెక్టర్‌కు, అక్కడ కూడా పొరపాటు జరిగితే ల్యాండ్ ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

మ్యుటేషన్‌లోనూ మార్పులు

1948 ఆర్వోఆర్ చట్టం ప్రకారం వారసత్వ భూమిపై హక్కుల కోసం మూడు నెలల వ్యవధిలో పట్వారీకి దరఖాస్తు చేసుకోవాలి. ఆయన ఆ వివరాలను మ్యుటేషన్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఈ రిజిస్టర్‌ను తహసీల్దారు, ఆపై స్థాయి అధికారి పరిశీలించిన తరువాత హక్కుల రికార్డులోకి ఎక్కిస్తారు. రిజిస్ట్రేషన్ ద్వారా హక్కులు సంక్రమిస్తే మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అవసరం లేదు. 1971 ఆర్వోఆర్ ప్రకారం వారసత్వ భూమిపై హక్కుల కోసం నెల వ్యవధిలో తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్టర్ దస్తావేజు ద్వారా హక్కులు సంక్రమించినప్పుడు రిజిస్ట్రేషన్ అధికారి తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలి. తహసీల్దార్ వాటిని పరిశీలించి.. హక్కుల రికార్డులో నమోదు చేస్తారు. 2020 ఆర్వోఆర్ ప్రకారం కొనుగోలు, దానం, తనఖా, బదిలీ ద్వారా హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులు చేస్తారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేసారి జరిగిపోతుంది. వారసత్వంగా భూమి వస్తే వారసులు సంయుక్త ప్రకటన రాసుకుని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే.. రికార్డుల్లో మార్పు చేస్తారు. 2020 చట్టంలో అప్పీల్ వ్యవస్థ లేదు. కోర్టును ఆశ్రయించాల్సిందే. 2024 చట్టం ప్రకారం కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగ పంపకాల ద్వారా హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులు చేస్తారు. ఒకే రోజు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిపోతుంది. వారసత్వ భూమిపై హక్కుల కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే రికార్డుల్లో నమోదు చేస్తారు. నిర్ణీత వ్యవధిలో మ్యుటేషన్ చేయకపోతే ఆటోమేటిక్‌గా అవుతుంది. కోర్టు తీర్పు, లావోణీ పట్టా, 38ఈ, 13బీ సర్టిఫికెట్, ఓఆర్‌సీ, సేల్ సర్టిఫికెట్ ద్వారా హక్కులు సంక్రమిస్తే ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుంటే హక్కుల రికార్డులో మార్పు చేస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నాటి నుంచి భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరగడానికి భూమి పటం తప్పనిసరి చేశారు. తహసీల్దార్ ఉత్తర్వులపై ఆర్డీవోకు, ఆర్డీవో ఉత్తర్వులపై కలెక్టర్ లేదా జేసీలకు అప్పీల్ చేసుకోవచ్చు. వీరి తీర్పులపై భూ ట్రిబ్యునల్‌కు రివిజన్ అధికారాలు ఇచ్చారు.

ప్రతి కమతానికి విశిష్ట గుర్తింపు

గతంలో ఏ చట్టంలోనూ ఈ అంశాన్ని పొందుపర్చలేదు. డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునికీకరణలో భాగంగా భూ కమతాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నారు. 2024 చట్టంలో ప్రతి భూ కమతానికి తొలుత తాత్కాలిక భూధార్ నంబర్ ఇచ్చి, సర్వే చేసిన తరువాత శాశ్వత భూధార్ ఇచ్చేలా ప్రతిపాదించారు. 1948లో హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ మాత్రమే ఇచ్చే వారు. కోర్టులో ఏదైనా కేసు నమోదు చేయాలంటే హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ తప్పనిసరి. 1971 చట్టం ప్రకారం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే పట్టాదార్ పాస్‌పుస్తకం, భూ యాజమాన్య హక్కు పత్రం ఇచ్చేవారు. 2020 చట్టంలో పట్టాదార్ పాస్‌పుస్తకం కమ్ టైటిల్ డీడ్/ భూ యాజమాన్య హక్కు పత్రం ఇచ్చారు. 2024 చట్టం ప్రకారం పట్టాదారు పాస్‌పుస్తకం కమ్ టైటిల్ డీడ్/ భూ యాజమాన్య హక్కు పత్రం ఇస్తారు. దీంతోపాటు భూధార్ ఇవ్వనున్నారు. పాస్‌పుస్తకాలకు రిజిస్టర్ దస్తావేజుకు ఉన్న విలువే ఉంటుంది. హక్కుల రికార్డు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. ఎవరైనా సర్టిఫైడ్ కాపీలు పొందవచ్చు.

రైతులకు మేలు చేయనుంది

భూభారతి-2024 చట్టం ద్వారా గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది రైతులకు మరింత మేలు చేసే అవకాశం ఉంది. భూ సమస్యలకు పరిష్కారం చూపనుంది. ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న మార్గదర్శకాలతో అన్ని అంశాలపై స్పష్టత ఇవ్వనుంది. తద్వారా 2020 చట్టం ద్వారా ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మంచి జరుగుతుంది. ఆర్వోఆర్ చట్టం ప్రధాన ఉద్దేశం నెరవేరుతుంది.

- సునీల్, భూ చట్టాల నిపుణుడు

అధికారులపై చర్యలుంటాయా?

1948, 1971 చట్టాల ప్రకారం రికార్డుల్లో సవరణలు చేసిన ప్రభుత్వ అధికారిపై ఎలాంటి చర్యలకు తావు లేదు. 2020 చట్టం ప్రకారం రికార్డుల్లో సవరణలు చేసినా.. తొలగించినా ప్రభుత్వ అధికారిపై కేసు నమోదుకు అవకాశం లేదు. రికార్డులు ట్యాంపర్ చేసినా, మోసపూరిత చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెట్టవచ్చు. ప్రభుత్వ భూములకు పాస్‌పుస్తకాలు ఇస్తే కలెక్టర్ రద్దు చేయవచ్చు. 2024 చట్టం ప్రకారం రికార్డుల నమోదు, సవరణ చేపట్టే అధికారిపై ఎలాంటి కేసు పెట్టేందుకు వీలు లేదు. రికార్డులు ట్యాంపర్ చేసినా, మోసపూరిత చర్యలకు పాల్పడినా క్రిమినల్ చర్యలకు అవకాశం ఉంది. సర్వీస్ నుంచి తొలగించవచ్చు. ప్రభుత్వ భూములకు పాస్‌పుస్తకాలు ఇస్తే కలెక్టర్ రద్దు చేయవచ్చు. తహసీల్దార్‌ను ఉద్యోగం నుంచి తొలగించి, క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు.

24,200 పైన బుల్లిష్

(డిసెంబరు 30-జనవరి 3 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 24,781-23,939 పాయింట్ల మధ్యన కదలాడి 225 పాయింట్ల లాభంతో 23,813 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,796, 23,874, 24,228, 24,154 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైకి రావడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,200 బ్రేక్‌డౌన్ స్థాయి: 23,500
నిరోధ స్థాయిలు: 24,025, 24,125, 24,225 (23,925 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,700, 23,600,23,500 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	550
వరంగల్	552	గోదావరి	550
చిత్తూరు	583	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	106
వరంగల్	95	గుంటూరు	106
కరీంనగర్	95	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	94
కర్నూలు	95	నెల్లూరు	94
విశాఖపట్నం	105	అనంతపురం	94
గోదావరి	106		

ప్రైవేట్ బ్యాంకులకు తప్పని
ఉద్యోగుల వలసలు

25 శాతానికి చేరిన అట్రిషన్



న్యూఢిల్లీ: దేశంలోని ప్రైవేట్ బ్యాంకులకు కొత్త కష్టాలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగుల్లో ఏటా 25 శాతం మంది ఈ బ్యాంకుల నుంచి వలస పోవటమో (అట్రిషన్) లేదంటే గుడ్‌బై చెప్పటమో జరుగుతోంది. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి. 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2023-24' పేరుతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయం తెలిపింది. ఉద్యోగులు ఇంత పెద్దఎత్తున వలస పోవటం ఈ బ్యాంకుల నిర్వహణకు పెద్ద సమస్యగా మారనుందని హెచ్చరించింది. కొన్ని ప్రైవేట్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్ఎఫ్‌బీ)ల్లో ఈ వలసల సమస్య మరింత ఎక్కువగా ఉంది.

పీఎస్‌బీలను మించిన సిబ్బంది: ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)తో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకుల్లో పని చేసే ఉద్యోగులే ఎక్కువ. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరాంతానికి పీఎస్‌బీల్లో 7,64,679 మంది పని చేస్తుంటే.. ప్రైవేట్ బ్యాంకుల్లో 8,46,530 మంది పని చేస్తున్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అప్పట్లో పీఎస్‌బీల్లో 8,42,813 మంది పనిచేస్తుంటే ప్రైవేట్ బ్యాంకుల్లో పని చేస్తున్న సిబ్బంది 3,03,856 మాత్రమే. 'పెద్దఎత్తున ఉద్యోగులు మానేయడం, ఒక్కో ఉద్యోగి ద్వారా సమకూరే సగటు టర్నోవర్‌ని దెబ్బతీస్తోంది. దీనివల్ల ఖాతాదారుల సేవలకూ ఇబ్బంది ఏర్పడుతోంది. దీనివల్ల ప్రైవేట్ బ్యాంకుల నియామకాల ఖర్చులూ పెరిగిపోతున్నాయి' అని ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది.

ఇవే నివారణ చర్యలు: ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రైవేట్ బ్యాంకులు తీసుకోవాల్సిన చర్యలూ ఆర్‌బీఐ నివేదిక సూచించింది. విస్తృత శిక్షణ, ప్రమోషన్ అవకాశాలు పెంచడం, ప్రత్యేక ప్రోత్సాహకాలు, సిబ్బంది అదే బ్యాంకులో దీర్ఘకాలం పాటు పనిచేసేందుకు అనువైన వాతావరణం కల్పించడం వంటి వ్యూహాత్మక చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ సూచించింది.

గోల్డ్ లోన్స్‌పై జర జాగ్రత్త: పసిడి రుణాల మంజూరు విషయంలో బ్యాంకులు ఇప్పటికీ కొన్ని తప్పిదాల చేయడాన్ని ఆర్‌బీఐ ఎత్తి చూపింది. ముఖ్యంగా థర్డ్ పార్టీలు ఈ రుణాల మదింపు, వాటిపై పర్యవేక్షణ సరిగా లేదని స్పష్టం చేసింది. నిర్ణీత కాల వ్యవధిలో బ్యాంకులు ఈ లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది.

బిజినెస్

ఇంధనంపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలి

సీఐఐ


న్యూఢిల్లీ: వినియోగాన్ని ఉత్తేజితం చేయడానికి ఇంధనంపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వానికి సూచించింది. ఇంధన ధరలే ద్రవ్యోల్బణం అదుపు తప్పడానికి కారణమని, ఫలితంగా అల్పాదాయ వర్గాల వారు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని పేర్కొంది. అలాగే రూ.20 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారిపై వ్యక్తిగత ఆదాయపు పన్ను తగ్గించే విషయం కూడా పరిశీలించాలని, దానివల్ల కూడా వినియోగం పెరిగి అధిక పన్ను వసూళ్లు వస్తాయని సూచించింది. వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులపై గరిష్ఠ మార్జినల్ రేట్ 42.74% ఉంటే సాధారణ కార్పొరేట్ పన్ను రేటు 25.17% ఉన్నదని, ఈ వ్యత్యాసం తగ్గించాలని కోరింది.

ఏప్రిల్‌లో నవీముంబై విమానాశ్రయం ప్రారంభం

ముంబై: నిర్మాణంలో ఉన్న నవీ ముంబై విమానాశ్రయం వచ్చే ఏడాది ఏప్రిల్ 17న ప్రారంభం కావచ్చని అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ సీఈఓ అరుణ్ బన్సల్ తెలిపారు. ఆదివారం ఈ విమానాశ్రయంలోని 26/08 రన్‌వేపై ఇండిగో ఏ320 ప్రయాణికుల విమానం విజయవంతంగా దిగింది. విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు ఏరోడ్రోమ్ లైసెన్సు ఇవ్వడానికి ఈ ప్రయోగం మార్గం సుగమం చేస్తుంది. మే ద్వితీయార్థం నుంచి ఈ విమానాశ్రయం నుంచి సాధారణ రాకపోకలు ప్రారంభించాలని తాము భావిస్తున్నట్టు చెప్పారు. మొదటి ప్రయోగం విజయవంతమైన తర్వాత కొన్ని విధివిధానాలు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

అభివృద్ధే మన తారక మంత్రం

- అతి నియంత్రణలతో అనర్థమే
- పోటీ సామర్థ్యం పెంచుకోవాలి


ఉదయ్ కోటక్

న్యూఢిల్లీ: వచ్చే సంవత్సరాని (2025)కి సుస్థిర అభివృద్ధే మన లక్ష్యం కావాలని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వెబ్‌సైట్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పోస్టు చేశారు. దేశాన్ని సుసంపన్న దేశంగా తీర్చిదిద్దాలంటే అభివృద్ధి ఒక్కటే మార్గమన్నారు. ఇందుకోసం ఆయన ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను సూచించారు. అతి నియంత్రణలను తొలగించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. అప్పుడే మన పారిశ్రామికవేత్తల అసలు సిసలు సామర్థ్యం బయట పడుతుందన్నారు.

పోటీ సత్తా పెంచుకోవాలి: కార్మికుల ఉత్పాదకత పెంచుకోవడం ద్వారా అంతర్జాతీయ పోటీకి తగ్గట్టు మన పరిశ్రమలు ఎదగాలని ఉదయ్ కోటక్ సూచించారు. వాణిజ్య రక్షణ విధానాలతో స్వల్పకాలిక లాభాలే తప్ప దీర్ఘకాలంలో ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఈ రక్షణ విధానాలు దీర్ఘకాలం కొనసాగితే మన పరిశ్రమల పోటీ సామర్థ్యమూ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆర్థిక స్థిరత్వం కోసం ద్రవ్యలోటుతో పాటు మూలధన ఖాతా లోటును (సీఏడీ) తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు.

'రక్షణ'తోనే సౌభాగ్యం: దేశ రక్షణ, భద్రతలపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని కోటక్ సూచించారు. ఈ రెండూ ఉంటేనే దేశ సౌభాగ్యానికి అర్థం ఉంటుందన్నారు. అక్రమాలు, గాలి బుడగలు ఏర్పడితే తప్ప ప్రభుత్వం స్టాక్ మార్కెట్లో జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేశారు. సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో కోటక్ ఈ సూచనలు చేయడం విశేషం.

కన్సాలిడేషన్ కొనసాగింపు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. బెంచ్‌మార్క్ సూచీల్లో కన్సాలిడేషన్ కొనసాగనుంది. ఇప్పటికిప్పుడు సూచీలు మెరుగ్గా రాణించకపోవచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందితేనే సూచీలకు నిర్ణయాత్మక గమనం ఉంటుంది. ఎఫ్ఐఐలు వెళ్లిపోవటం, రూపాయి బలహీనపడటం ప్రతికూల అంశాలు.

స్టాక్ రికమండేషన్స్

క్యాంపస్ యాక్టివ్‌వేర్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం వాల్యూజోన్‌లో ట్రేడవుతోంది. టర్న్ అరౌండ్ కనిపిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారంఈ షేరు 4.17 శాతం లాభంతో రూ.315 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.310/300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.345/375 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.290 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లారస్ ల్యాబ్స్: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలక నిరోధ స్థాయికి చేరుకుంది. నెగటివ్ మార్కెట్లోనూ ఈ షేరు బలం ప్రదర్శించింది. చివరి నాలుగు సెషన్లలోనూ లాభపడింది. గత శుక్రవారం 2.82 శాతం లాభంతో రూ.586 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లుమాక్స్ ఆటో: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతోంది. దిద్దుబాటు జరగటతో డిమాండ్ పెరుగుతోంది. పైగా ప్రతి త్రైమాసికంలోనూ మెరుగైన ఫలితాలు విడుదల చేస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 2.73 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.630/610 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.670/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.575 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లూపిన్: ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కొనసాగుతోంది. పైగా 2016 నాటి నిరోధాన్ని బ్రేక్ చేసింది. హెడ్ లైన్ సప్లయ్ ముగిసినట్టే కనిపిస్తోంది. గత శుక్రవారం 2.09 శాతం లాభంతో రూ.2,227 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,200/2,180 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,140 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అరబిందో ఫార్మా: ఈ ఏడాది ఆగస్టులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 30 శాతం వరకు కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. అక్యుములేషన్‌కు అవకాశం కనిపిస్తోంది. నిఫ్టీతో పోల్చితే బలం పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.1,269 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,250 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,360/1,380 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

తదుపరి నిరోధం 24,000

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మైనర్ పుల్‌బ్యాక్ రికవరీ సాధించి ముందు వారంతో పోల్చితే 225 పాయింట్లు లాభపడింది. అయితే గత వారం 24,000-23,600 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలోనే కదలాడింది. ప్రస్తుతం 23,800 వద్ద అప్రమత్త ధోరణిలో నిలిచి ఉంది. గత వారం మిడ్ క్యాప్-100 సూచీ 73 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 40 పాయింట్ల స్వల్పలాభంతో ఫ్లాట్‌గా ముగిశాయి. టెక్నికల్‌గా మార్కెట్ ఇటీవల సాధించిన గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన నిలిచి ఉండడం అనిశ్చిత ధోరణిని సూచిస్తోంది. ప్రస్తుత స్థితిలో మరింత కన్సాలిడేషన్ అవసరం. స్థూల ట్రెండ్ మాత్రం ఇంకా బలహీనంగానే ఉంది. గత శుక్రవారం గరిష్ఠ స్థాయిల్లో బలహీన ధోరణి ప్రదర్శించడం కూడా మరింత బలహీనత ఉండనేందుకు సంకేతం. శుక్రవారం అమెరికన్ స్టాక్‌మార్కెట్లో ఏర్పడిన బలహీన ట్రెండ్ కారణంగా ఈ వారంలో భారత మార్కెట్ అప్రమత్తంగా కదలాడే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి ప్రధాన స్వల్పకాలిక నిరోధం 24,000. ఇక్కడే గత కొన్ని వారాలుగా పలు ప్రయత్నాలు చేసి మార్కెట్ విఫలమవుతూ వస్తోంది. స్వల్పకాలిక సానుకూలత కోసం మార్కెట్ ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 24300, 24,550.

బేరిష్ స్థాయిలు: మార్కెట్‌కు 23,650 వద్ద మైనర్ మద్దతు ఉంది. ఇదే గత గురువారం ఏర్పడిన బాటమ్. ఈ స్థాయి కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,500. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ టెక్నికల్ బౌన్స్‌బ్యాక్ సాధించి 550 పాయింట్ల స్వల్ప లాభంతో 51,300 వద్ద ముగిసింది. సానుకూలత కోసం ప్రధాన నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 52,000. బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం ప్రధాన మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకుని పాజిటివ్ కన్సాలిడేషన్ సాధించాలి.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 200 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. సానుకూలత కోసం 24,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. 23,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు ఉంది. ఇక్కడ నిలదొక్కుకుంటే సానుకూల ధోరణి ఏర్పడుతుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	23,930, 24,000
మద్దతు	23,690, 23,650

ఇంటర్వ్యూ..

గ్రామీణ రోడ్ల ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్దపీట

- పంచాయతీ రాజ్ డీఈ కొత్త జవహర్ బాబు



బిజినేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తారు రోడ్ల నిర్మాణం చేపట్టాలంటే పంచాయతీరాజ్ శాఖ అధికారులు ధ్రువీకరించి ఎస్టిమేషన్ రూపొందించి ప్రతిపాదనలు చేయాల్సి ఉంటుందని పంచాయతీ రాజ్ శాఖ డీఈ కొత్త జవహర్ బాబు తెలిపారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో ఎలాంటి పనులు చేపట్టారు, ఎంతవరకు పురోగతి సాధించారో ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు...

రోడ్లు లేని గ్రామాలకు రహదారుల నిర్మాణం చేపడుతున్నారా?

మండలంలోని వెల్గొండ-వట్టెం గ్రామాల మధ్య స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.కోటి నిధులతో తారు రోడ్డు పనులు పూర్తి చేశాం. అలాగే వెల్గొండ-బాజీపూర్ గ్రామాల మధ్య, లట్టుపల్లి బోర్సుగడ్డ తండా మధ్య, మమ్మాయిపల్లి నుంచి వడ్డెర బస్తీ వరకు తారురోడ్లు వేసేందుకుప్రతిపాదనలు పంపాం. మంజూరు వచ్చింది. సంబంధిత కాంట్రాక్టర్లు త్వరలో పనులు ప్రారంభిస్తరు.

నూతన పంచాయతీ కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నారా?

మండలంలో నూతనంగా 15 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించుకునేందుకు రూ.20 లక్షలు మంజూరు ఉంది. ఇప్పటికే చిన్నపీరు తండా, మీట్యాతండా, బొర్సుగడ్డ, నక్కల చెరువు తండా, మమ్మాయిపల్లి తదితర గ్రామాలలో నిర్మాణాలు యాభై శాతం నుంచి 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగతా గ్రామాల్లో కూడా స్థల సేకరణ, పునాదుల దశల్లో ఉన్నాయి. అవన్నీ సకాలంలో పూర్తి అయ్యేలా కాంట్రాక్టర్లను ఆదేశిస్తున్నాం. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు చేపట్టాం. అక్కడక్కడా నాణ్యతగా పనులు లేవని ఆరోపణలు రావడంతో మా అధికారులు అక్కడే ఉండి సిమెంట్, ఇసుక, కంకర నాణ్యతను పరిశీలించడంతో పాటు డెప్తును పరిశీలించిన తర్వాత రోడ్డు వేయనిస్తాం. అలాగే క్వాలిటీ కంట్రోల్ బోర్డు అధికారులు పరిశీలన ఉంటుంది.

న్యూస్ బాక్స్

వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డికి విజ్ఞప్తి



కేవీఎన్.రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి,డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ జరిగేలా చూడాలని కోరుతూ వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్.రెడ్డిని యువజన కాంగ్రెస్ నాయకులు ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. రైతులందరికీ రుణమాఫీ జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు కోరారు. రైతు బంధు సైతం పదెకరాల్లోపు ఉన్న వారికే వచ్చేలా చూడాలని కోరారు. ఈ విషయాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి తెలిపారు. ఆయనను కలిసిన వారిలో శివప్రసాద్, తిరుపతయ్య, శివకుమార్, ఆరిఫ్ ఉన్నారు.

మత్స్య సంపదను దోచుకుపోతున్న వారిపై చర్యలు

- జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ వాకిటి ఆంజనేయులు

కొల్లాపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో అలివి వలలతో మత్స్య సంపదను దోచుకుపోతున్న ఇతర రాష్ట్రాల వ్యాపారులపై, వారిని ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తప్పవని జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ వాకిటి ఆంజనేయులు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణానదిలో అలివి వలలు, చార్మిన్ వలలతో మత్స్య సంపదను దోచుకుపోతుండడంతో సంవత్సరం పొడవునా మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నామని అన్నారు. ఈ విషయమై మత్స్య కార్మికులు, జిల్లా మత్స్య సహకార సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. చిన్నంబావి మండలం అయ్యవారిపల్లి, కాలూరు, జటప్రోలు, మంచాలకట్ట, మల్లేశ్వరం, సోమశిల, అమరగిరి, కోతి గుండు, అంకాలమ్మ కోట, లింగమయ్య పెంట వరకు ఇతర రాష్ట్రాల నుంచి బిహార్, ఒడిశా, ఆంధ్ర నుంచి వచ్చిన చేపల దొంగలు అలివి వలలు చార్మిన్ వలలతో, అగ్గివల్ల నుంచి విత్తన చేప పిల్లలు, మూడించులు, 100 గ్రాములు సైజు ఉన్న చేప పిల్లలను గుంజి ఎండు చేపలుగా మార్చి కొంత మంది దళారులు మాత్రమే సొమ్ము చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర మత్స్యకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి మత్స్యశాఖ, అటవీశాఖ, హోంశాఖ వారికి ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు.

రోడ్లు ఇలా.. నడిచేదెలా ?

- కంకర తేలిన రోడ్డుతో ఇబ్బందులు



నాగులపల్లి-ముత్తిరెడ్డిపల్లి గ్రామాల మధ్య కంకర తేలిన రోడ్లు గుంతలమయం

కోడేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. అడుగు లోతు గుంతలు, కంకర తేలిన రోడ్లపై వెళ్లాలంటే ప్రయాణికులు, వాహనదారులు జంకుతున్నారు. మండలంలోని నాగులపల్లి నుంచి కోడేరు మీదుగా పెద్దకొత్తపల్లి రోడ్డు మధ్యలో ఆపేశారు. సింగోటం వయా ఎత్తం నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, సింగయ్యపల్లి, ఏదుట్ల వరకు మొత్తం 22 కిలోమీటర్లు రూ.32 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. కానీ, మధ్యలోనే పనులు ఆపేశారు. రోడ్డు నిర్మాణం ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెవెలుగు కానని గ్రామాలెన్నో ?

గ్రామాలు, పట్టణాలు అభివృద్ధిలో పరుగులు పెడుతుంటే కోడేరు మండలంలో మాత్రం నేటికీ ఎర్ర బస్సులు వెళ్లని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. మండలంలోని ఖానాపూర్, నార్యానాయక్ తండా, ఠాగూర్‌తండా, గుండ్యనాల్యా నాయక్ తండా, రేగులపల్లి, నాగులపల్లి తండా తదితర గ్రామాలకు బస్సులు లేకపోవ డంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేస్తాం

మండలంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, వంతెనల పనులను త్వరలో పూర్తి చేస్తాం. ప్రస్తుతం సింగోటం, పసుపుల తదితర రోడ్లు బీటీ వేస్తున్నాం. మరిన్ని కొత్త రోడ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాము. మంజూరైన వెంటనే పనులను ప్రారంభిస్తాం. రోడ్లు అక్కడక్కడా పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరలోనే వారితో చర్చించి పనులు ప్రారంభిస్తాం.

- పర్వతాలు, ఆర్అండ్‌బీ ఏఈ

రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే. అడుగులోతు గుంతలు ఉన్నాయి. ప్రభుత్వం కనీసం రోడ్ల మెయింటనెన్స్ చేయకపోవడంతో కంకర తేలి వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి పశువులు నడవ లేకపోతున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే గుంతల్లో ఎప్పుడు ఎక్కడ కిందపడతామో తెలియని పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతి నిధులు ఇప్పటికైనా రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.

- రాములు, నాగులపల్లి గ్రామం

బలహీన వర్గాల అభ్యున్నతే సీపీఐ లక్ష్యం



గుంతకోడూరులో జెండావిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వార్ల వెంకటయ్య

తాడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల వారు ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధించడమే సీపీఐ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వార్ల వెంకటయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గుంత కోడూరు గ్రామంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో జెండా ఆవిష్కరణ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. రైతుల హక్కులను కాపాడే విషయంలో కమ్యూనిస్టులు ఎప్పుడూముందు వరుసలో ఉంటారన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రభుత్వాలు చొరవ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తోటపల్లివాసికి ఎల్ఎల్ఎం ప్రదానం



ఉమాపతికి ఎల్ఎల్ఎం పట్టాను ప్రదానం చేస్తున్న ఉస్మానియా వీసీ కుమార్

కల్వకుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి చెందిన బుడుమ ఉమాపతి న్యాయ శాస్త్రంలో ఎల్ఎల్ఎం పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కాశీంగార్లు ఉమాపతికి ఎల్ఎల్ఎం పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఉమాపతి ఎల్ఎల్ఎం పట్టా అందుకోవడం అభినందనీయమని గ్రామీణ ప్రజలకు న్యాయ సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ఉమాపతికి అవార్డు రావడం పట్ల మిక్కి రాష్ట్ర అధ్యక్షుడు విప్ల గాంధీ, సీనియర్ నాయకులు కాటిక రామస్వామి, నాగర్‌కర్నూల్ ఇల్లా అధ్యక్షుడు దుబ్బ నాగేష్, ఉపాధ్యక్షుడు మోహన్, కోశాధికారి రాజన్న, మిక్కి సభ్యులు బాలజంగయ్య, భీముడు, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

జ్ఞాన సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

- సీనియర్ స్వేరో దుబ్బ నాగేష్

కల్వకుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జ్ఞాన సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీనియర్ స్వేరో దుబ్బ నాగేష్ పేర్కొన్నారు. ఆదివారం కల్వకుర్తి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా స్వేరో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలోనాగేష్, ఎదిరి మల్లేష్, బుద్దుల రామకృష్ణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వచ్చే జనవరి 3న పరకాలలో జరిగే మాత సావిత్రిబాయి పూలే జయంతిని విజయవంతం చేసేందుకు జిల్లాలోని స్వేరోస్ అందరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. అక్షరం ఆర్థికం ఆరోగ్యం అనే ప్రధాన లక్ష్యాలతో స్వేరో ఆర్గనైజేషన్ ముందుకు సాగుతుందని వారు పేర్కొన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచన విధానానికి ఆశయానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడు వడ్డెమాన్ మోహన్‌కుమార్, జిల్లా సోషల్ మీడియా కమాండర్, సంపత్‌కుమార్, సీనియర్ స్వేరోస్ నాయకులు పోలే శేఖర్, పదర మండల ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్, అఖిల్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ కళాశాల లెక్చరర్ మహమ్మద్ అలీ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం సమీపంలో గల బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ అలీ (38) గుండెపోటుతో మృతి చెందారు. తెల్లవారుజామున నైట్ డ్యూటీ అనంతరం అక్కడే మార్నింగ్ వాకింగ్ చేస్తున్న క్రమంలో గుండెపోటుతో పడిపోయారు. అతనిని చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఉన్నారు. మహమ్మద్ అలీ మృతికి పలు పురు సంతాపం తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు జిల్లా ఆసుపత్రి వద్ద భారీ సంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు.

అన్ని రంగాలలో విశ్వకర్మల అభివృద్ధికి కృషి

- అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కాకునూర్ బ్రహ్మాచారి



నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాలచారి

ఉప్పునుంతల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మలు అన్నిరంగాలలో అభివృద్ధి చెందేందుకు తన వంతు కృషి చేస్తానని అఖిల బారతీయ విశ్వకర్మ సరిషత్ జిల్లా అధ్యక్షుడు కాకునూర్ బ్రహ్మాచారి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన విశ్వకర్మ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా అఖిల బారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షునిగా ఉప్పునుంతల మండలం తాడురు గ్రామానికి చెందిన కాకునూర్ బ్రహ్మాచారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాలచారి చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసంఘటిత కార్మికశాఖ విశ్వకర్మ సెల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చింతోజు చెన్నయ్యచారి, బొడ్డుపల్లి చరణ్, తేజస్వి, ఇందుమతి, దేవపూజ, ఈశ్వర్, నరసింహ్మా, తదితరులు ఉన్నారు.

'మాజీ ప్రధానికి అవమానం'

వంగూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని, స్మారకం నిర్మించే ప్రాంతంలో కాకుండా నిగంబోధ్‌లో అంత్యక్రియలు నిర్వహించడం సరికాదని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశం గర్వించదగిన ముద్దుబిడ్డ మన్మోహన్ అని, పదేళ్ల పాటు ప్రధానిగా పని చేశారని నిగంబోధ్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించడం దారుణమన్నారు.

ఎంబీ చర్చి యూత్ కమిటీ ఎన్నిక

కందనూలు,డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో నూతన యూత్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎంబీ చర్చి యూత్ చైర్మన్‌గా ఏ.ప్రదీప్ కుమార్, సెక్రటరీగా ఈఐ డానిజయసింహ, డీజే.జగదీశ్‌లు ఎన్నికయ్యారు. యూత్ చైర్మన్ ఏ.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ మరింత చురుగ్గా పని చేయడానికి అవకాశం ఇచ్చిన చర్చి కమిటీకి, యూత్ వారికి, సంఘస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పును తక్షణమే వెనక్కి తీసుకోవాలి

- మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రామదాసు

కొల్లాపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రామదాసు డిమాండ్ చేశారు. మాలల చైతన్య సమితి ఆవిర్భవించి 9 సంవత్సరాలు విజయవంతమైన సందర్భంగా ఆదివారం హలో మాల చలో మహబూబ్‌నగర్ కార్యక్రమం నిర్వహించారు. రామదాసు మాట్లాడుతూ మాలల చైతన్య సమితి ఆవిర్భవించి 9 సంవత్సరాలు విజయవంతమైన సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని టీఎన్జీవో భవనంలో 9వ వార్షికోత్సవ సభను నిర్వహిస్తారని తెలిపారు. మాలలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాలల చైతన్య సమితి తాలూకా అధ్యక్షుడు అవుట ఎర్ర శ్రీనివాసులు, తాలూకా నాయకులు మద్దెల వెంకటరాములు, సంఘం నాయకులు మూలే భరత్, బాపనపల్లి సందీప్, మద్దెల అంజి, కర్నె సాంబశివుడు, గోర్ల శివశంకర్, గడ్డం మోహన్, బ్యాగరి రాజు, పాలెం కేశవులు, మూల చిన్న లాలయ్య, జిల్లెల విష్ణు, జిల్లెల కేశవులు, రవి, రాము తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో వృద్ధురాలు మృతి

- మృతురాలి బంధువుల ఆరోపణ

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై నాగర్‌కర్నూల్ మండలంలోని అవురాసిపల్లి గ్రామానికి చెందిన బాలకిష్టమ్మ(65) అనారోగ్యానికి గురై శుక్రవారం జిల్లా ఆసుపత్రిలో చేరింది. వైద్యులు పరీక్షించి హైబీపీ ఉండడంతో ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. హైబీపీ పెరగడంతో ఆమెను ఐసీయూకి మార్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ఈ సంఘటనపై మృతురాలి బంధువులు స్పందిస్తూ వైద్యులు సకాలంలో వైద్య సేవలు అందించనందుకే ఆమె మృతి చెందిందని ఆరోపించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రఘును వివరణ కోరగా హైబీపీతోపాటు వృద్ధురాలికి ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. వైద్యం సకాలంలోనే అందించామని పరిస్థితి విషమంగా ఉండి మృతి చెందిందన్నారు. వైద్యుల నిర్లక్ష్యం లేదని ఆయన పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం

దోమలపెంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాస శివరాత్రి సందర్భంగా దోమలపెంట (బ్రహ్మగిరి) ఉమామహేశ్వర శివాలయ దేవస్థాన కమిటీ అధ్వర్యంలో ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ గత మహాశివరాత్రి నుంచి అన్నదానం చేపడుతున్నామని తెలిపారు. శ్రీశైలం వచ్చిపోయే భక్తులు, గ్రామస్థులు అన్న దానంలో పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఆత్మహత్య

తెలకపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ బి.నరేష్ అందించిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన రెడ్డపాకుల నిరంజన్ (50) సంవత్సరాలు 15 సంవత్సరాల నుంచి భార్యాభర్తలకు గొడవలు రావడం వల్ల భార్య అలివేలు మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటుందని, మృతుడు నిరంజన్ గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్నాడు. తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం తన ఇంట్లో ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి అక్క నోముల రేవతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ బి.నరేష్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

కల్వకుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల తండాలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో రాత్లావత్ సీత్యా గుడిసె దగ్ధమైంది. సీత్యా తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా అయన గుడిసెలో నుంచి పొగలు రావడాన్ని గమనించిన తండా వాసులు నీళ్లు చల్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కల్వకుర్తి నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ సిబ్బంది వారికి సహాయం అందించారు. గుడిసెలో ఉన్న ధాన్యం, బియ్యం, బట్టలు, నగదు, భూమి, ఆధార్, ఇతర సర్టిఫికెట్లు కాలిపోయా యని బాధితుడు తెలిపారు.

బీసీలు రాజ్యాధికారం కోసం ఐక్యంగా సాగాలి



నంది వడ్డెమాన్‌లో బీసీ కమిటీ సభ్యులతో బీసీ సంఘం మండల నాయకులు

బిజినేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీసీలు రాజ్యాధికారం దిశగా ఐక్యంగా సాగాలని బీసీ మండల కమిటీ కన్వీనర్ ఊర్కొండ రఘుబాబు కోరారు. మండలంలోని నంది వడ్డెమాన్‌లో ఆదివారం జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో నూతన గ్రామ బీసీ కమిటీని ఎన్నుకొని మాట్లాడారు. 50 శాతానికి పైగా బీసీ జనాభా ఉన్నా చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం మాత్రం తక్కువ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని తెలిపారు. నంది వడ్డెమాన్ బీసీ కమిటీ అధ్యక్షుడిగా కడారి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా అన్కని రమేష్, కోశాధి కారి వంగ దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఉప్పుగంటి యాదయ్య, దాసరాజు శ్రీరాములు, వట్టిపల్లి నరసింహ, కాశీం, కార్యదర్శులు చెన్నయ్య, చిన్నయ్య, దస్తగిరి, రాజు, గౌరవ సలహాదారులు కురుమయ్య, ప్రభాకరాచారి, చిన్న కురుమయ్య, సోషల్ మీడియా లక్కీశ్వేర్ మల్లేషలను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల బీసీ నాయకులు రాజేందర్ గౌడ్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

రేపు ఆశా వర్కర్ల బస్సు యాత్ర ముగింపు సభ

- ఆశా వర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు శ్రీదేవి

కొల్లాపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 31న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరగనున్న ఆశా వర్కర్ల రాష్ట్ర బస్సు జాత ముగింపు సభను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు శ్రీదేవి కోరారు. ఆదివారం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆశా వర్కర్ల సమావేశం గౌరవమ్మ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రాష్ట్ర బస్సు యాత్ర ఈనెల 15 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ హైదరాబాద్‌లో ముగింపు సభ ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్రలో ఇస్తున్నట్లు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్ల్యూహెచ్‌వో సంస్థ ఆశా వర్కర్లకు గ్లోబల్ హెల్త్ లీడర్స్ అవార్డును కూడా అందించిందని తెలిపారు. అయినా కూడా కేంద్ర ప్రభుత్వం ఆశాలను నేటికీ గుర్తించడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల, వకలదేవి, మల్లికాంత, రాధ, అనిత, అరుణ, రేణుక, నీలమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అమ్రాబాద్‌లో జడ్పీహెచ్ఎస్‌లో పాల్గొన్న 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అమ్రాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో 1990-91లో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎం.కే. గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో పెద్ద ఎత్తున హాజరై ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ పాఠశాలలో చదువుకొని వివిధ హోదాలలో ఉన్న వారందరూ 30ఏళ్ల తర్వాత ఒకే చోటకు చేరుకొని చిన్ననాటి విషయాలను చర్చించుకున్నారు. తమతో కలిసి చదుకొని మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు. అలాగే తామందరం ఒక ట్రస్ట్‌లా ఏర్పడి సమాజంలో వెనుకబడిన ప్రజలకు చేయూత నివ్వాలని సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రుడు, గౌస్, సాదిక్, వెంకటయ్య, రాజేష్, శేఖర్, వహీం, శ్రీశైలం, జహంగీర్, కరీం, కిష్టయ్య, రాధ, వన జారాణి, వీరయ్య, హరి, రామచంద్రయ్య, నాగ రాణి, అరుణమ్మ, జ్యోతిలతో పాటు 1991 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉప్పునుంతల : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వం పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న బ్యాచ్ పూర్వ విద్యార్థుల తమ 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం కొత్త యశోద ఫంక్షన్ హాల్ ఘనంగా జరుపుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు కాశన్న, హనుమంత్‌రెడ్డి, ఇస్రత్‌బేగం, సత్‌పాల్ రెడ్డి, సత్యనారాయణను పూర్వ విద్యార్థులు అరుణ, కవిత, సౌజన్య, విజిత, అనిత, బాలస్వామి, విష్ణువర్ధన్ యాదవ్, శ్రీను, తిరుపతయ్య, వెంకట్రాములు, వెంకటయ్య, మల్లేష్, భీమేశ్వరచారిని శాలువా కప్పి సన్మానించారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి : కేవీపీఎస్

కల్వకుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా ఉప్పుగూడలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంపై దాడి చేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థికి కాలు తగిలిందని విధి నిర్వహణలో ఉన్న హెచ్ఎంపై దాడి చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వెంటనే వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పరుశరాములు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లె జగన్, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు నారిమల్ల కుర్మయ్య, కేవీపీఎస్ నాయకులు విజయ్, పరశురాములు, నిరంజన్, ఎల్లమ్మ, స్వర్ణ, నందిని తదితరులు ఉన్నారు.

ఒంటికాలిపై నిలబడి నిరసన



నాగర్‌కర్నూల్‌లో ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్క రించాలని నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగు లు 20వ రోజు ఆదివారం ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మరళీ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని ఇరవై రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎస్ఎస్ఏ ఉద్యోగుల పేస్కేల్ పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు తదిత రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బాల్యమిత్రుల ఆర్థిక సాయం

తాడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మల సూగురు గ్రామానికి చెందిన శంకర్ పదిరోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో శంకర్ బాల్యమిత్రులైన 2005 సంవత్సరానికి సంబంధించి కుమ్మెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పదవ తరగతి క్లాస్‌మేట్ సభ్యులు కలిసి రూ.లక్షా 12వేలను జమ చేశారు. వారు శంకర్ ఇద్దరు కూతుళ్లకు చెరొక రూ.56వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి కుటుంబ సభ్యులకు డిపాజిట్ బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో కనకాల మధు, పల్లె భాస్కర్, నంది హనుమంత్‌రెడ్డి, బంక రాజేందర్‌రెడ్డి, ముంగి భాస్కర్‌గౌడ్, దంగట్ల చెన్నకేశవులు, దేవంగి మహేష్‌గౌడ్, అనంత రాజు, బీర్ల మల్లేష్, ఆరాం శ్రీనివాసులు, బంక అనూష, సంగెం కల్పన, బంక రాజ్యలక్ష్మి, మిద్దె బంగారయ్య పాల్గొన్నారు.

● చారకొండ : మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కాటం ముత్యాలమ్మ ఆదివారం మృతి చెందింది. వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు రూ. 10వేలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితి ఆశాదీప్‌రెడ్డి రూ.5వేలు, మాజీ సర్పంచ్ పాలాది మల్లీశ్వరి రూ. 5వేలు ముత్యాలమ్మ అంత్యక్రియలకు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలాది బాలరాజు, సత్యహరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ జూపల్లి రాములు యాదవ్, తెలంగాణ ఉద్యమకారుడు బొజ్జన్నలతో పాటు పలువురు నాయకులు, గ్రామస్థులు ముత్యాలమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎండీ సిరాజ్, గిరివర్ధన్ యాదవ్, విజయ్, కడారి జంగయ్య, షైబు పాల్గొన్నారు.